క్లుప్తంగా

రాజీ మార్గమే రాజమార్గం



సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లలో రాజీ పడదగిన కేసులు అన్ని పరిష్కారం అయ్యేలా చూడాలని సత్తెనపల్లి సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్ ఆవరణలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్.హెచ్.ఓలతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రాజీ పడదగిన కేసులు ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో న్యాయమూర్తులు తౌషిద్ హుస్సేన్, పి.ప్రియదర్శిని, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ముఖ్యం



క్రోసూరు: గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. క్రోసూరు సీఐ మంగారావు వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బడి ఈడు వయసున్న పిల్లలందరూ పాఠశాలకు వెళ్లాలని కోరారు. పిల్లల్ని పనులకు పంపించటం చట్టరీత్యా నేరం అన్నారు. సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ బాల కార్మికులుగా ఎవరైనా కనిపిస్తే 1098 ఉచిత టోల్ ఫ్రీ నెంబర్‌కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల వెంకట్రామిరెడ్డి , వీఆర్వో సైదులు, పోలీసు సిబ్బంది షణ్ముఖ , ఉపేంద్ర , దాసు సంస్థ మండల ఇన్‌ఛార్జి టి లక్ష్మణ్ , బాబు ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



నూజెండ్ల: మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయులు వి.నరసింహారావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, ఎల్.అంజిరెడ్డి, ఏఎస్ఎస్ సూర్యప్రకాష్, జి.చిన్నగోవిందు పాల్గొన్నారు.

బడి బయటి చిన్నారుల గుర్తింపు



బొల్లాపల్లి: నేను బడికి పోతాను కార్యక్రమం మండలంలోని కనుమలచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరగడటంతో పాటు అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలను బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.కోటానాయక్ సూచించారు. బడిబయట, బడి మానేసిన చిన్నారుల గుర్తించేందుకు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధన ఉంటుందని తెలిపారు. ఐదేళ్లు నిండిన పిల్లలను బడికి తప్పని సరిగా పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్కే సైదావలి, ఎం.శివారెడ్డి, ఏవీ రమణ, కె.బాలు నాయక్, టి.శ్రీలత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోందిపై అవగాహన ర్యాలీ



బొల్లాపల్లి: అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం మండలంలోని మేళ్లవాగు మెయిన్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎస్కే మస్తాన్ బీ, తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. 3 సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్య బోధన అందిస్తున్నట్లు వివరించారు.

మినరల్ కాదు.. జనరల్

- శుద్ధీకరణ పేరిట ప్రజలను మోసగిస్తున్న సంస్థలు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి విక్రయాలు
- నిబంధనలు పాటించని ప్లాంట్ నిర్వాహకులు
- ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు



ఆటోల్లో తరలిస్తున్న వాటర్ క్యాన్లు

సత్తెనపల్లి: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలు మినరల్ వాటర్‌నే అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా శుద్ధి చేసిన నీటికి అలవాటు పడ్డారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. ఒక పట్టణం , నాలుగు మండలాల్లో సుమారు 100 కిపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం వాటికి అనుమతులు లేవు. సాధారణంగా మున్సిపల్ ద్వారా పట్టణంలోని వార్డులకు, పంచాయతీల ద్వారా గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంటుంది. గ్రామీణ తాగునీటి సరఫరా సరిగ్గా లేని కారణంగా ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లలో లభ్యమయ్యే తాగునీటికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో క్యాన్ నీళ్లకు డిమాండ్ పెరిగింది. పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు వెలిశాయి. చాలామంది ఆటోల్లో క్యాన్లను ప్లాంట్ వద్దకు తీసుకెళ్లి నీళ్లు నింపి ఇళ్ల వద్దకు వచ్చి అమ్ముతున్నారు. చిన్న టీకొట్టు దగ్గర నుంచి పెద్ద హోటళ్ల వరకు ఈ నీటినే వాడుతున్నారు. దీంతో మినరల్ వాటర్‌కు డిమాండ్ ఉండడంతో ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా జనరల్ నీటినే సరఫరా చేస్తున్నారు. ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

శుద్ధి చేసిన తీరు ఇది..

మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు ముందుగా బోరు వేసి అక్కడ ఒక గదిని ఏర్పాటు చేసుకొని నీటిని శుద్ధి చేస్తామని చెబుతారు. మీరు రుచిగా ఉండటానికి సోడియం ఫ్లోరైడ్, సోడియం కార్బోనేట్ వంటి పొడర్లు కలుపుతారు. ప్లాంట్లులో పనిచేసే వారు చేతులకు గ్లౌజ్‌లు వంటివి వేసుకోకుండా నీటిని నింపుతారు. క్యాన్‌లను ఆటోల ద్వారా ట్యాంకుల్లో నింపి విక్రయిస్తున్నారు. మరికొంతమంది ఇళ్ల ముందే ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని వినియోగదారుడు రాగానే క్యాన్‌కు పట్టి పంపిస్తున్నారు.

ఇష్టమొచ్చిన ధరకు అమ్మకాలు..

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా నీటిని క్యాన్‌లలో నింపి ధరలను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ. 15 నుంచి రూ. 20 వరకు అమ్ముతున్నారు. ఇళ్ళ ముందు ఏర్పాటు చేసుకున్న చిన్న ప్లాంట్లు వద్దకు వచ్చేవారికి 20 లీటర్ల నీటిని రూ. 5కు విక్రయిస్తున్నారు. ఇవికాక వాటర్‌ని కూలింగ్ చేసి 20 లీటర్ల క్యాన్‌ను రూ. 30 చొప్పున విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కనీస ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకొని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు...

- ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ సర్టిఫికెట్ ఉండాలి.
- 12 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్లాంట్ యజమానులు పొందాలి.
- అత్యున్నత సాంకేతికత కలిగిన మిషన్‌లతో నీటిని శుద్ధి చేయాలి.
- నీటిని పరీక్షించడానికి ఒక ల్యాబ్ ఏర్పాటు చేసుకొని, రోజూ శుద్ధి చేసిన నీటిని పరీక్షించాలి.
- వాటర్ ప్యాకెట్ల తయారీలో 60 మైక్రాన్ల కంటే ఎక్కువ పాలిథిన్‌ను వినియోగించాలి.
- ఐఎస్ఐ ముద్రను తప్పనిసరిగా ముద్రించాలి.
- ప్యాకెట్ల కాలపరిమితి గడువును తప్పక ముద్రించాలి. తయారైనప్పటినుంచి 21 రోజుల్లో వాటిని విక్రయించాలి.
- ఇళ్ల మధ్య భూమిలో నీటిని వినియోగించకూడదు. మునిసిపల్, పంచాయతీ అనుమతి తీసుకొని పైప్ లైన్ ద్వారా నీటిని వినియోగించుకోవాలి.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లిలో గల శ్రీ రామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని తులసి మాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీసీజీ టీకా వేయించుకోవాలి

రాజుపాలెం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ప్రతి సోమవారం, గురువారం వయోజనులకు క్షయ వ్యాధి రాకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి కృష్ణ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో ఉన్న 7560 మందికి గాను 1650 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు. రాబోయే మూడు నెలలలో మండలానికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేస్తామని చెప్పారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ మరణాలు తగ్గించవచ్చు

ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు



శిక్షణ పొందిన వైద్యులు, తదితరులతో సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు

సత్తెనపల్లి: ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం వల్ల క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధానపరిషత్ సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఈ నెల 13 నుంచి ప్రారంభమైన క్యాన్సర్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ నోటి క్యాన్సర్, సర్వైకిల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, రక్త పోటు, మధుమేహం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వ్యాధులకు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయడం వల్ల క్యాన్సర్ వల్ల వచ్చే మరణాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 13న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి శిక్షణ తరగతులను ప్రారంభించారన్నారు. మొత్తం ఆరు బ్యాచులుగా నిర్వహించే ఈ శిక్షణ శనివారంతో మొదటి విడత శిక్షణ పూర్తయ్యిందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జాఫర్ ఇమాంబిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఏ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, జిల్లా ఎపిడిమాలజిస్ట్ షేక్ నజీర్, డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ కుప్పాల అనూష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్త సహా ముగ్గురిపై కేసు నమోదు

సత్తెనపల్లి: భార్యని వేధించిన భర్త సహా మరో ముగ్గురిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని వడవల్లి పోలేరమ్మ గుడి ఏరియాకి చెందిన రేవతికి, రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన ములుపురి నాగేశ్వరరావుకు ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్ల పాటు కలిసిమెలిసి ఉన్నారు. అనంతరం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న నాగేశ్వరరావు భార్యను అధిక కట్నం తీసుకురమ్మని వేధించాడు. ఆయనతోపాటు అత్త, మామ, ఆడబిడ్డ వేధించడంతో ఐదేళ్ల క్రితం ఆమె సత్తెనపల్లి వచ్చి కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ పీ.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

21న సత్తెనపల్లి నుంచి అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుండి ఈ 21న మధ్యాహ్నం 3.00 గంటలకు అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 22న అరుణాచలం, గిరి ప్రదక్షిణ, దర్శనం అయిన తర్వాత అదే రోజు సాయంత్రం బయలుదేరి కంచి మీదుగా సత్తెనపల్లి ఈ నెల 23న ఉదయం చేరుకుంటారన్నారు. టిక్కెట్ ధర రాను పోను ఒక్కొక్కరికి రూ.2 వేలు మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ అవకాశమును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవ పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ఫిరోజి ఋషీంద్రుల వారి మఠంలో వేంచేసిన గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం జ్యేష్ఠ శుద్ధ దశమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శ్రీశ్రీశ్రీ ఫిరోజి ఋషీంద్రుల ఉప పీఠాధిపతి ఫిరోజ్‌బాబు శనివారం తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

నిరుద్యోగ భృతికి విధివిధానాలు ప్రకటించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు

సత్తెనపల్లి: నిరుద్యోగ భృతిపై రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు వెంటనే రూపొందించి అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని పుతుంబాక వేంకటపతి భవన్ నందు శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ సమీక్షతో పాటు భవిష్యత్తు కార్యక్రమాల మీద చర్చించారు. సమావేశం అనంతరం ఆంజనేయ రాజు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని, స్కిల్ అసెస్మెంట్ పేరిట కాలయాపన చేయకూడదన్నారు. ఉపాధి పొందటం ప్రజల ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలు చేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన 75 శాతం స్థానిక పరిశ్రమలో రిజర్వేషన్ చట్టాన్ని కొనసాగించి కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసలో బలి అయ్యింది యువతేనన్నారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం యువతను ఎన్నికల్లో గొడవ పడేలా ప్రోత్సహించారన్నారు. రాజకీయ పార్టీలు యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎటువంటి హింస జరగకుండా చూడాలని విన్నవించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అయినా మెగా డీఎస్సీ మీద సంతకం చేయటం సంతోషమని, అలాగే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఆందోళనలు చేసిన సందర్భంగా పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థను రాజకీయ పార్టీలు తమ పార్టీ కార్యకర్తల కేంద్రం గా కాకుండా నడపాలన్నారు. మెరిట్ ఆధారంగా నియమించాలని, ఇంటర్వ్యూ ద్వారా నియమించే పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జడ రాజ్ కుమార్, ఉదయ్ భాస్కర్, ఇక్లాస్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశ సంపద

కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య



మాట్లాడుతున్న డాక్టర్ రూత్‌రమ్య

సత్తెనపల్లి: యువత దేశ సంపదని, చదువుకున్న ప్రతి వ్యక్తి తన చదువును సార్థకం చేసుకునే క్రమంలో సంపాదన అనేది ఎంతో ముఖ్యమైనదని కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు పట్టణంలోని టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాల నందు శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రూత్‌రమ్య మాట్లాడుతూ చదివే జీవితానికి ఒక మార్గంలా పనిచేస్తుందని , యువత సమయాన్ని, చదువుని సక్రమంగా ఉపయోగించుకున్నప్పుడు ఉన్నతమైన స్థితిని వెళ్లొచ్చన్నారు. మరొక అతిథి స్కాలర్స్ సంస్థ డైరెక్టర్ ఇమ్మానుయేలు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదువుపట్ల మక్కువ కలిగి తక్కువ సమయంలో స్థిరపడినప్పుడు భవిష్యత్తు ఎంతో బాగుంటుందన్నారు. దాని ద్వారా కుటుంబానికి, సమాజానికి ఎంతో ఉపయోగ పడవచ్చునన్నారు. ముందుగా యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. నిరుద్యోగ యువత 210 మంది హాజరయ్యారు. కార్యక్రమానికి హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించారు. 12 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా హెల్ప్ ఫౌండేషన్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు సౌజన్య, ఉమ్మడి గుంటూరు జిల్లా హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్, ఫౌండేషన్ సభ్యులు బాబి, నర్మద, టీచర్స్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం



విశేష అలంకరణలో నర్సింగపాడు గ్రామంలోని శ్రీ మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామి వారు

నకరికల్లు మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని శ్రీ మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం 7 వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకలకు తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ చండీహోమం నిర్వహించారు. స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సమీపంలోని పలుగ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్తసంఘం సహకారంతో ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మహాకవి శ్రీశ్రీ యువతకు ఆదర్శం



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పించిన దృశ్యం

క్రోసూరు: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావును యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ది క్రోసూరు యూత్ సర్వీస్ క్లబ్ గౌరవాధ్యక్షులు కొంకాయల వీరాంజనేయరెడ్డి అన్నారు. శనివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలు, మూఢ విశ్వాసాలు, దేశంలో నెలకొన్న దోపిడీ వ్యవస్థపై నిప్పులు చెరుగుతూ రాసిన కవితలను పేదలకు అంకితం చేసిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. ఆయన కవితలు నేటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. క్లబ్ అధ్యక్షులు రొంపిచర్ల రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ అని అన్నారు. మహిళా సాధికారతను, వారి సమస్యలను ఎలుగెత్తి చాటడంలో శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలని షిరిడి సాయిబాబా సంఘ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు అన్నారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళిత నాయకులు దాసు, బీసీ సెల్ నాయకులు బొప్పూడి రమేష్, మామిడి పెద్ద సింగయ్య పాల్గొన్నారు.

ఇంటిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



ముద్దాయితో పోలీసు అధికారులు

క్రోసూరు: ఈనెల 13 వ తేదీ న మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఇంటిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ షఫీ తెలిపారు. మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన జవ్వాదిసురేష్ చెడువ్యసనాలకు అలవాటుపడి గ్రామంలో, చుట్టుప్రక్కల గ్రామాల్లో అప్పులు చేసాడు. తన ఖర్చులకు ,అప్పులు తీర్చేందుకు డబ్బుల కోసం తిరుగుతూ దొడ్లేరులోని పోసిపోగు ఆంధ్రబాబు ఇంట్లో బంగారు వస్తువులున్న ట్రంకు పెట్టె చోరీ చేసాడు. ముద్దాయి గతంలో కూడా పత్తి దొంగతనం కేసులో జైలుకెళ్లాడని తెలిపారు. డీఎస్పీ జి. గురునాథబాబు పర్యవేక్షణలో సీఐ ఎం.మంగారావు, ఎస్ఐ ,సిబ్బంది కలిసి అనంతవరం గ్రామంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతడి నుంచి 155.950 గ్రాముల బంగారపు ఆభరణాలు, 132 గ్రాముల వెండి వస్తువులు, రూ 3,500 నగదు, ఒక వివో సెల్‌ఫోను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సోమేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెంలోని శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో 7వ వార్షికోత్సవం శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కమిటీ ప్రతినిధి సౌభాగ్య శర్మ మాట్లాడుతూ గ్రామస్తులు ఆలయ ధర్మకర్త కొసన రామకోటేశ్వరరావు సారథ్యంలో ఈనెల 17వ తేదీ వరకు వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. తొలిరోజు ఆలయ ప్రదక్షిణ, రుద్రాభిషేకం, చండీ హోమం 16వ తేదీన గణపతి రుద్రహోమం, నీరాజనం, మంత్ర పుష్పం, చివరిరోజు స్వామి వారికి కల్యాణ వేడుకలు, మహాపూర్ణాహుతి, భారీ అన్నదాన సంతర్పణ ఉంటుందని వివరించారు.

ప్రజలకు ఇబ్బందిలేకుండా తాగునీరు సరఫరా

మున్సిపల్ కమిషనరు రవిచంద్రారెడ్డి



కొండలరావు పేటలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనరు

నరసరావుపేట: ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం 15 వార్డు కొండలరావుపేట, 17వ వార్డు వరవకట్ట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలపై అక్కడి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరవకట్టలోని కొన్ని ప్రాంతాల్లో నీరు తక్కువగా వస్తుందని ఎక్కువ సేప్పు అందించే విధంగా చూడాలని ప్రజలు కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ తాగునీరు అందరికీ అందేలా సరఫరా చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పర్వదిన సందర్భంగా పట్టణంలో ఉన్నటువంటి అన్ని మసీదుల వద్ద శుభ్రంగా ఉండే విధంగా చూడాలని, మసీదుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

చట్టం రద్దుపై న్యాయవాదుల హర్షం



నరసరావుపేట: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయటాన్ని స్థానిక న్యాయవాదులు హర్షించారు. శనివారం కోర్టు ప్రాంగణం ముందు స్టేషన్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై కేక్ కట్ చేశారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేదరమెట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి ఏ కొండలరావు, న్యాయవాదులు సీజే ప్రతాప్, చంద్ర ఆంజనేయులు, ఎం.ఆరోగ్యంచౌదరి, బోయిన పిచ్చేశ్వరరావు, చెన్నుపాటి నాగేశ్వరరావు, జీవీ సుబ్బారావు, అలెగ్జాండర్ సుధాకర్, దేశిరెడ్డి చిన్నపరెడ్డి, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.